క్లుప్తంగా

ఉపాధి హామీ ఏపీఓకు డిప్యుటేషన్..

సాక్షి ఎఫెక్ట్..

మరిపెడ రూరల్: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మరిపెడ కార్యాలయం సిబ్బంది పాతుకుపోయారు. 10–12 ఏళ్లుగా ఒకే చోట నుంచి కదలకుండా విధులు నిర్వహిస్తున్నారు. దీనిపై గత నెల 29న 'పాతుకుపోయారు' అనే కథనం 'సాక్షి'లో ప్రచురితమైన విషయం విదితమే. కాగా ఇక్కడ ఉపాధి హామీ ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న మంగమ్మను దంతాలపల్లి మండలానికి డిప్యుటేషన్ పై వెళ్లినట్లు ఎంపీడీఓ విజయ తెలిపారు.

భద్రాద్రికి గోటి తలంబ్రాలు

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ సీతారామచంద్రస్వామి ఆలయ భక్తులు సిద్ధం చేసిన గోటి తలంబ్రాలను గురువారం భద్రాచలంలోని రామచంద్రస్వామి ఆలయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తలంబ్రాలను గ్రామంలో ఊరేగించిన అనంతరం ప్రత్యేక వాహనంలో భద్రాచలం తరలివెళ్లారు. గ్రామ ఆలయ కమిటీ ప్రతినిధులు నున్నా రమణ, భారతి దంపతులతోపాటు నున్నా మల్లికార్జున్, జగన్, చంద్రం, ప్రకాశరావు, రామలింగాచారి పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫయర్ బహూకరణ



చిన్నగూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విర్బాక్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి రాజ్‌కుమార్ వాటర్ ప్యూరిఫయర్‌ను గురువారం బహూకరించారు. హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్ రెడ్డి, రఘుపతి, సుగుణాకర్, జక్కి నాగేశ్వర్, విమల, సుల్తానా, శ్రీలత పాల్గొన్నారు.

ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్



మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో భాగంగా ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయుడు తక్కెళ్లపల్లి వీరభద్రం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉప్పలయ్య, ఉపాధ్యాయులు సోహెన్ బీ, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసరావు, సతీష్ కుమార్, సోమేశ్వర్ పాల్గొన్నారు.

డీఆర్‌యూసీసీ సభ్యుడిగా మైనుపాషా



డోర్నకల్: డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ(డీఆర్‌యూసీసీ) సికింద్రాబాద్ డివిజన్ సభ్యుడిగా డోర్నకల్‌కు చెందిన మనుపాషా నియమితులయ్యారు. మైనుపాషాను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్, సుశీల్‌జైన్ అభినందించారు.

లాఠీచార్జ్ సరికాదు

తొర్రూరు: సెంట్రల్ యూనివర్సిటీ భూముల రక్షణ కోసం ఉద్యమించిన విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడం సరికాదని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కాగు నవీన్ తెలిపారు. హెచ్‌సీయూ విద్యార్థులపై లాఠీఛార్జ్‌ను నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో బీజేవైఎం అర్బన్ అధ్యక్షుడు శీలం శ్రీనాథ్, నాయకులు నూకల నవీన్, రాజు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌కు చెందిన పోతరాజు వరుణ్‌తేజ్ అనే విద్యార్థి నవోదయ సీటు సాధించాడు. ఈమేరకు గురువారం పాఠశాలలో విద్యార్థిని కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిర్ర నరేష్, విద్యార్థి తల్లిదండ్రులు రమేష్–మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభినందనలు

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రావులు శ్రీధర్‌రెడ్డి, అంబటి పృథ్వీశ్వర్‌రెడ్డి ఎన్నికయ్యారు. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ బాధ్యుడు ముల్లంగి ప్రతాప్‌రెడ్డి, కోచ్ వెలిశాల కుమారస్వామి, సీనియర్ క్రీడాకారులు చంద్రయ్య, ప్రసాద్‌రెడ్డి, కాశీనాథ్, కమల్ కిశోర్ తదితరులు బొకే అందజేసి అభినందనలు తెలిపారు.

మానుకోటలో మట్టి దొంగలు

- చెరువులు, కుంటలు, అడవులు, పోడు భూముల్లో మట్టిగుట్టలు మాయం
- అధికారులకు ఫిర్యాదు చేసినా ఆగని దందా



ఈదులపూసపల్లి అక్కిరేణికుంట చెరువులో రాత్రి మట్టిని తవ్వుతున్న జేసీబీ

మహబూబాబాద్ అర్బన్: మానుకోటలో అక్రమార్కుల మట్టి దందాకు అడ్డుకట్ట పడడం లేదు. అనుమతులకు మించి గుట్టలను, కొందరు గుల్ల చేస్తున్నారు. ఇచ్చిన అనుమతులను అడ్డం పెట్టుకొని మరికొందరు చెరువులను, గుంటల మట్టిని తవ్వి ఇటుక బట్టీలకు, వాణిజ్య అవసరాలకు తరలిస్తున్నారు. అడవులు, పోడు భూములు, పొలాల్లో భూములను మట్టి గుట్టలను సైతం అక్రమార్కులు వదిపెట్టడం లేదు.

మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లిలో అక్కిరేణి కుంట చెరువులో సర్వే నంబర్ 33 గల కుంటలో 27ఎకరాల 37గుంటలు ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఉంది. ప్రస్తుతం అక్కడ ఐదు ఎకరాల భూమి కనిపించడం లేదు. తుమ్మల కుంట చెరువు రికార్డు ప్రకారం సర్వే నంబర్ 650లో గల శిఖంలో 20ఎకరాల 23గుంటలుగా ఉంది. కానీ అక్కడ చెరువు కుంట స్థలం 4ఎకరాల భూమి కనించడం లేదని ఈదులపూసపల్లి ప్రజలు వాపోతున్నారు. ప్రతీ రోజు రాత్రి డోజర్లు జేసీబీతో చెరువులను మొత్తం తవ్వి రాత్రి మట్టిని తరలిస్తున్నారు. జేసీబీతో, డోజర్‌తో, మట్టిని, ఇటుక బట్టీలకు, వెంచర్లకు, ఇళ్లకు, ఖాళీ స్థలాలకు మట్టిని అమ్ముకుంటు డబ్బులను దండుకుంటున్నారు.

చెరువులు, కుంటలను కాపాడాలి

ఈదులపూసపల్లిలో చెరువులు, కుంటలు కబ్జాలకు గురవుతున్నాయని, అక్రమ ఇళ్ల నిర్మాణం జరుగుతున్నాయని, మట్టిదందాపై జిల్లా అధికారులకు, తహసీల్దార్, ఎంపీడీఓ దృష్టికి పలువురు వినతిపత్రాలు అందజేసిన ప్రయోజనం లేకుండాపోయింది. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రతి రోజు రాత్రి దందా జరుగుతుంది. ట్రాక్టర్లతో మట్టిని తీసుకెళ్తుంటే శబ్దంతో అక్కడి ప్రజలకు నిద్రపట్టడం లేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఈదులపూసపల్లి చెరువులు, కుంటలను కాపాడాలని అక్కడి ప్రజలు కోరుకుంటున్నారు.

పేదల కడుపు నింపడమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్



కురవి: బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

కురవి/మరిపెడ రూరల్/తొర్రూరు/తొర్రూరు రూరల్: నిరుపేదల కడుపు నింపడమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని, అందుకోసమే సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. గురువారం మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, మానుకోట మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, ఆలయ చైర్మన్ కొర్పు రవీందర్ రెడ్డి, గొల్లపల్లి రజనీకాంత్, బండి శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, జక్కుల నాగన్న పాల్గొన్నారు.

అధికారులు మాట వింటలేరు

అధికారంలోకి వచ్చిన సంతోషం లేకుండా పోయింది.. ఏ కార్యాలయంలోకి వెళ్లినా అధికారులు మాట వినడంలేదని అయ్యగారిపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు దొంగరి జనార్దన్‌రెడ్డి కార్యకర్తల బాధలను ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ఎదుట ఏకరువు పెట్టాడు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా గెలవాలని, అప్పుడు వారే విలువ ఇస్తారని తెలిపారు. కొన్ని చానళ్లు తాను ప్రజలకు అందుబాటులో ఉండడంలేదని ఆరోపిస్తున్నాయన్నారు. తాను గత ఎమ్మెల్యే లాగా అవినీతి, బియ్యం, బెల్లం, ఇసుక దందాలు చేయమంటారా? అని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు పనిచేస్తున్నానన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో నిజమైన అర్హులను గుర్తించాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ అధ్యక్షులతో జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఉన్న నిజమైన అర్హులను ఎంపిక చేసి, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వారు ఉండేలా ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఎక్కడైనా నిర్లక్ష్యం వహించినా, పైసలు వసూలు చేసినా సహించేదిలేదన్నారు. ప్రజలు నమ్మకంతో ఓటు వేసి గెలిపిస్తే ప్రజలకు న్యాయం జరిగేలా చూసే బాధ్యత మనపై ఉందని వెల్లడించారు. గడిచిన 15నెలల కాలంలో జరిగిన అభివృద్ధి, రాబోయే రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి

మహబూబాబాద్ రూరల్/గార్ల/దంతాలపల్లి: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని కోరుతూ ఈనెల 8వ తేదీన హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే ప్రజాధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి గుజ్జు దేవేందర్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం (బీ) గ్రామంలో ప్రజాధర్నా పోస్టర్లను గురువారం ఆవిష్కరించి వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చారి హరీశ్, శాంతి, రవి, విమల, శ్రీను, రాజు, మంగ్య, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నెల్లికుదురు: విద్యతోపాటు సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చిర్ర రమేశ్ బాబు, షీటీం ఎస్సై సునంద సూచించారు. ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళల రక్షణ చట్టాలు, షీటీం విధులు, సైబర్ నేరాలు, గంజాయితోపాటు ఇతర మత్తు పదార్థాలు, మైనర్ డ్రైవింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సైలు మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం ఎస్పీ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్న తెలిపారు.

లాభాలను సమకూర్చే పంటలు సాగు చేసుకోవాలి

- జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి మరియన్న



తాళ్లఊకల్‌లో ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న మరియన్న

మరిపెడ రూరల్: బోర్ల కింద ఆయిల్ పామ్, పండ్ల తోటలు, కూరగాయలు, పూలు, మల్బరీ, పలు రకాల ఉద్యాన పంటలను సాగు చేపట్టి లాభాలు సమకూర్చుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న రైతులకు సూచించారు. గురువారం మండలంలోని తాళ్లఊకల్, చౌళ తండాల్లో సాగులో ఉన్న ఆయిల్‌పామ్, మామిడి, జామ, నిమ్మ, పనస, సపోట, కూరగాయలు, పూల పంటక్షేత్రాల్లో పర్యటించి సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. అనంతరం వివిధ పంటలకు సంబంధించిన కర పత్రాలను రైతులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మామిడి, జామలో ఫ్రూట్ బాగింగ్, ఆయిల్ పామ్ తోటలో నల్ల కొమ్ము పురుగు నివారణ వేసవి పంటల సాగులో మెలకువలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు నరహరి, నగేష్, బాలాజీ, ఆయిల్ పెడ్ అధికారి అఖిల్, అధికారి ఎల్లయ్య పాల్గొన్నారు.

లాలుతండాలో భూవివాదం..

ఒకరికి తీవ్రగాయాలు

కురవి: భూవివాదంలో ఇరువురి కుటుంబాల మధ్య గురువారం రాత్రి ఘర్షణ చోటుచేసుకున్న సంఘటన సీరోలు మండలం చింతపల్లి శివారు పెద్ద లాలు తండా గ్రామంలో జరిగింది. తండావాసుల కథనం ప్రకారం.. పెద్దలాలు తండాకు చెందిన భూక్య రమేశ్(కిషన్) అనే వ్యక్తితోపాటు భూక్య భద్రు, దస్రూలతోపాటు మరికొందరి మధ్య భూవివాదం కొనసాగుతుంది. ఈక్రమంలో భూక్య రమేశ్ ఆ భూమిలో ఇళ్లు నిర్మించుకుంటున్నాడు. అయితే భద్రు, దస్రూ అనే వ్యక్తులు ఆటోలో రాతి కనీలు తీసుకుని వచ్చి ఆ స్థలం పక్కన పెడుతున్నారు. దీంతో రమేశ్‌కు భద్రు, దస్రూల మధ్య మాటమాట పెరిగి కర్రలతో కొట్టుకున్నారు. ఈ ఘర్షణలో రమేశ్ తలకు తీవ్రగాయమై రక్తం కారుతుండడంతో వెంటనే 108లో ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదులు వస్తే విచారణ చేస్తామని సీరోలు ఎస్సై నగేష్ తెలిపారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి



కురవి: పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కురవి: కేంద్రంలోని బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు జరుగుతున్నాయని, ఆర్ఎస్ఎస్ ఆలోచన విధానంతో రాజ్యాంగంలోని హక్కులను కాలరాస్తున్నారని, ప్రతీ ఒక్క పౌరుడు రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్ అన్నారు. గురువారం మండలంలోని బీబీనాయక్ తండా, కందికొండ, సూదనపల్లి, బంజరా తండా, కొత్తూరు(సీ), అయ్యగారిపల్లి గ్రామాల్లో ఏఐసీసీ ఆదేశాల మేరకు జైబాపు.. జైభీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర, ప్రతిజ్ఞలు, సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకర్‌రెడ్డి, నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి, బాదావత్ రామునాయక్, గొల్లపల్లి రజనీకాంత్, బండి శ్రీనివాస్, మలిశెట్టి వేణు, బాలగాని శ్రీనివాస్, దయ్యాల శ్రీధర్ పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో యాత్ర చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, పెండ్లి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు రవినాయక్, శశినందన్ రెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు అజ్మీర శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా కొనుగోళ్లు



రాస్తారోకో చేస్తున్న కార్మికులు

కేసముద్రం: మార్కెట్ బయట వే బ్రిడ్జిల ద్వారా నిబంధనలకు విరుద్ధంగా కొనుగోళ్లు చేపట్టరాదని గురువారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ఎదుట ప్రధాన రహదారిపై ఐఎఫ్‌టీయూ అనుబంధ తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారపు శ్రీధర్ మాట్లాడుతూ.. మార్కెట్ బయట వే బ్రిడ్జిల ద్వారా కొందరు వ్యాపారులు, దళారులు వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా మార్కెట్‌లో పనిచేసే దడవాయి, హమాలీ, కూలీలకు, బండ్ల కార్మికులకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. కాగా ప్రధాన రహదారిపై రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు మిట్టగడుపుల వెంకన్న, బట్టు నాగేశ్వర్‌రావు, కొట్టం అంజయ్య, బట్టమేకల రాజు, బండి రాజు, మంగీలాల్, సింగిరెడ్డి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలి



ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

మహబూబాబాద్ రూరల్: హైదరాబాదులో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఓ వివాహిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆమె మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా, ఆందోళన చేసిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన సాబాత్ మంజుల, వెంకట్ రెడ్డి దంపతుల కుమారుడు రజినీకాంత్‌కు వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రానికి చెందిన అన్నం రవి, లక్ష్మి దంపతుల కుమార్తె సౌజన్య (28)తో 2020లో వివాహం జరిగింది. వారికి మూడున్నర సంవత్సరాల వయసు గల కుమారుడు తేజ సూర్య రెడ్డి ఉన్నాడు. హైదరాబాదులోని కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ థర్డ్ ఫేస్ విభాగంలో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగాలు చేసుకునే రజనీకాంత్, సౌజన్య దంపతుల మధ్య కుటుంబ తగాదాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో ఆమె మనస్థాపానికి గురై ఈనెల ఒకటో తేదీ మంగళవారం ఉరివేసుకుని ఇంట్లో బలవన్మరణానికి పాల్పడింది. సౌజన్య మృతదేహాన్ని తీసుకుని వచ్చి కంబాలపల్లి గ్రామంలో గల అత్తగారింట్లో ఉంచారు. గురువారం ఉదయం ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు, కుటుంబ సభ్యులు కోరగా అందుకు అత్తింటి వారు స్పందించకపోవడంతో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై దీపిక, పెద్దమనుషులు అక్కడకు చేరుకుని మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం సౌజన్య మృతదేహాన్ని ఖానాపురం మండల కేంద్రానికి తీసుకుని వెళ్లారు.

చెరువుల మరమ్మతులు చేపట్టాలి

నెహ్రూసెంటర్: జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా తెగిపోయిన చెరువు కట్టల మరమ్మతులను వెంటనే చేపట్టాలని మెపా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దుండి అశోక్, జెట్టి యాకయ్య డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. అనంతరం మెపా రాష్ట్ర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్, రాష్ట్ర కార్యదర్శి తోట రమేశ్, మహేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

విమర్శలు అర్థరహితం

తొర్రూరు: సాగునీటి విడుదలపై ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో అత్యధికంగా వరి సాగు చేస్తున్నారని, ఎక్కడా నీటి కొరత తలెత్తలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు గంజి విజయ్‌పాల్‌రెడ్డి, సోమ రాజశేఖర్, వెంకన్న, సోమిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పేదలపై భారం

మహబూబాబాద్: వైకుంఠ రథం ఫీజు రూ.1000 కేటాయించడం వలన పేదలపై భారం పడుతుందని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ అన్నారు. సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో డీఈ సీహెచ్ ఉపేందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, శ్రావణ్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నెల్లికుదురు: వసతి గృహాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు తాజా కూరగాయలతో తయారు చేసిన నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న వసతి గృహాల నిర్వాహకులకు సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, ఆదర్శపాఠశాల, సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలను గురువారం తహసీల్దార్ కె.రాజు, ఎంపీడీఓ బాలరాజుతో కలిసి పరిశీలించారు.

భూములను లాక్కోవడం తగదు

డోర్నకల్: రాష్ట్ర ప్రభుత్వం యునివర్సిటీ భూములను లాక్కోవడం తగదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. డోర్నకల్‌లో గురువారం జరిగిన పార్టీ మండల కార్యదర్శ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు తురక రమేశ్, నెల్లూరి నాగేశ్వర్ రావు, ప్రభేష్, జెన్ను స్వామి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గూడూరు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన అనారోగ్య బాధితులకు గురువారం ఎంపీ బలరాంనాయక్ సహకారంతో మంజూరైన లబ్ధిదారుడికి రూ. 2లక్షల చెక్కులను మాజీ ఎంపీపీ నూనావత్ రమేశ్, మాజీ ఎంపీటీసీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి అందించారు.

దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలి

గూడూరు: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని, ఆయన ఆశయాలను కొనసాగించాలని మాజీ వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, రిటైర్డ్ హెచ్ఎం చీర భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలో గురువారం దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నూనావత్ రమేష్‌నాయక్, కత్తి స్వామి, వెంకన్న, సురేందర్ పాల్గొన్నారు.

పోలీసుల పహారా టెంటుకు నిప్పు

చిన్నగూడూరు: అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీసులు ఏర్పాటు చేసుకున్న పహారా టెంట్‌కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఇసుకను అక్రమంగా తరలించేందుకే కొంతమంది కావాలనే డేరాను తగలబెట్టినట్లు గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది.

చర్య తీసుకోవాలి

బయ్యారం: మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలో బీసీకి చెందిన వ్యక్తి భూమిని ఆక్రమించిన వారిపై చర్య తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు గుగ్గిళ్ల పీరయ్య, గుగులోత్ భీమానాయక్ ప్రభుత్వాన్ని గురువారం డిమాండ్ చేశారు.

అర్ధరాత్రి అరెస్టులా?

గార్ల: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో పోలీసులు పీడీఎస్‌యూ నాయకులను అర్ధరాత్రి అరెస్టులు చేయడాన్ని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు మహేష్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

చీకట్లో మగ్గుతున్న తండావాసులు

మరిపెడ రూరల్: అబ్బాయిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పత్తికుంటతండాలో కొద్ది రోజులుగా వీధి దీపాలు లేక తండా వాసులు చీకట్లో మగ్గుతున్నారని సీపీఎం అబ్బాయిపాలెం గ్రామ కార్యదర్శి కొండ ఉప్పలయ్య ఆరోపించారు. గురువారం పత్తికుంటతండాలో సీపీఎం బృందం పర్యటించింది.

చెక్కుల అందజేత

మహబూబాబాద్ రూరల్: భరోసా సెంటర్ నుంచి ఎనిమిది మంది బాధితులకు అందాల్సిన తక్షణ సహాయంలో భాగంగా రూ.65వేల విలువ గల చెక్కులు, ఒకరికి కుట్టు మిషన్‌ను ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు, భరోసా సెంటర్ ఇన్‌చార్జ్, ఎస్సై ఝాన్సీ, జ్యోష్న, సాహిత్య, జయశ్రీ, బేబీ పాల్గొన్నారు.

ఇసుక డంపునకు వేలంపాట

గార్ల: మండలంలోని దుబ్బగూడెం గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 30 ట్రాక్టర్ల ఇసుక డంపునకు ఈనెల 8న వేలంపాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కృష్ణవేణి గురువారం తెలిపారు.

ఎల్ఓసీ మంజూరు

మహబూబాబాద్ రూరల్: నెల్లికుదురు మండలంలోని మునిగలవవీడు గ్రామానికి చెందిన పి.సాయిశ్రేయాన్స్ వైద్య సహాయం కోసం ఎమ్మెల్యే మురళీనాయక్ రూ.8 లక్షల ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేయించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గురువారం బాధితుడి తండ్రి శ్రవణ్‌కుమార్‌కు ఎల్ఓసీ ఉత్తరాన్ని అందజేశారు.

మహాసభలను విజయవంతం చేయాలి

కురవి: ఈనెల 5వ తేదీన నారాయణపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్(టీయూసీఐ అనుబంధ) రాష్ట్ర 2వ మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి తెలిపాడు. గురువారం మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, సైదులు, వీరన్న, వెంకన్న, శ్రీరాములు, ప్రవీణ్, వీరయ్య, దుర్గమ్మ పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

డోర్నకల్: ఎంపీడీఓ కార్యాలయాన్ని మండల ప్రత్యేక అధికారి నర్సింహమూర్తి గురువారం తనిఖీ నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యాలయంలోని ప్రజాపాలన హెల్ప్ డెస్క్, రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను తనిఖీ చేసిన అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌నాయక్, ఎంపీఓ మున్వర్ అలీబేగ్ పాల్గొన్నారు.

ఆరునెలలుగా అందని వేతనాలు

గూడూరు: ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ ఎదుట వేతనాల కోసం ప్రైవేట్ ఉపాధ్యాయులు బైటాయించిన సంఘటన మండలంలోని పొనుగోడులో గురువారం జరిగింది. ఈసందర్భంగా బాధితులు మౌనిక, అనిల్, రమ్య, స్వాతి, కుమార్, స్వాతి, శైలజ, శోబన్, హుస్సేన్, భవాని మాట్లాడుతూ.. పొనుగోడు జెడ్పీహెచ్ఎస్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యావ్రతలను బట్టి విద్యాబోధకులుగా గ్రామానికి చెందిన విద్యావేత్త కోరె వెంకన్న తమను నియమించాడన్నారు. 6నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, అడిగితే రోజులు గడుపుతూ దాట వేశాడని ఆవేదన వ్యక్తం చేశారు.

దొంగల అరెస్ట్

నర్సింహులపేట: మండలంలోని పడమటిగూడెం శివారు చారి తండాలోని జాటోత్ సురేష్ ఇంట్లో గత నాలుగు రోజుల క్రితం బంగారం అపహరణ ఘటనలో గురువారం ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై మాలోతు సురేష్ గురువారం తెలిపారు. విచారణ చేపట్టిన ఎస్సై తండాలోని జాటోత్ ప్రవీణ్, జాటోత్ నవీన్‌లకు విచారించి వారి నుంచి 4తులాల పుస్తెలతాడు, చైన్ స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

మంచి విత్తనాలను ఎంపిక చేసుకోవాలి

కేసముద్రం: ప్రతి రైతు మంచి విత్తనాలను ఎంపిక చేసుకుని పంటలను సాగు చేయాలని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని గాంధీనగర్ గ్రామ శివారు మేకపోతుల మోహన్‌రెడ్డి అనే రైతు సాగు చేసిన అంకుర్ భాస్కర్ కంపెనీకి చెందిన మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు.

విగ్రహ ప్రతిష్ఠ భూమి పూజ

దంతాలపల్లి: తెలంగాణ రైతాంగ సాయిధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జనం మదిలో ఎప్పటికీ పదిలంగా ఉంటాడని తహసీల్దారు రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా యాదవుల ఆధ్వర్యంలో తలపెట్టిన కొమురయ్య విగ్రహ ప్రతిష్ఠ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎస్సై పిల్లల రాజు, ఎంపీఓ అప్సర్ పాషా, ఊడుగుల ఐలేష్ యాదవ్ పాల్గొన్నారు.